
బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 04 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## మాకు అధిక వాటా కావాలి

- కేంద్రానికి తెలంగాణ విజ్ఞప్తి
- 42 టీఎంసీలకు మించి ఇవ్వలేమన్న కేంద్ర జలశక్తి శాఖ

బలగం టీవీ, హైదరాబాద్

గోదావరి-కావేరీ నదుల అనుసంధానంతో తెలంగాణ అధిక భూభాగాన్ని కోల్పోతోందని, కాబట్టి తమకు నీటి వాటాలో ఎక్కువ ఇవ్వాలని తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. జాతీయ జల అభివృద్ధి సంస్థ 74వ పాలకమండలి సమావేశం కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్, ఇంజినీర్లు వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ నుంచి చేపడుతున్నందున అధిక వాటా ఇవ్వాలన్నారు. గోదావరి-కావేరీ అనుసంధానంతో తరలించే 148 టీఎంసీల్లో సగం వాటా ఇవ్వాలన్నారు. అయితే ఇలా మళ్లించే నీటిలో 42 టీఎంసీలకు మించి నీటిని తెలంగాణకు ఇవ్వలేమని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. నీటి వాటా పంపిణీకి సంబంధించి రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ నెలాఖరున మరోసారి సమావేశం నిర్వహించాలని కేంద్ర జలవరుల శాఖ భావిస్తోంది.



# హైదరాబాద్ అభివృద్ధికి క్రమపద్ధతిలో బాటలు

- విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం
- కాంగ్రెస్ వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం 29 శాతం పెరిగింది
- హైదరాబాద్‌ను టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడేలా చేస్తాం
- ఎవరు అడ్డుపడినా మూసీ పునరుజ్జీవం ఆగదు
- రూ.5827 కోట్లతో అభివృద్ధి పనులు
- హైదరాబాద్ రైజింగ్ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



బలగం టీవి, హైదరాబాద్

దేశంలో ముఖ్య నగరాలైన ఢిల్లీ, ముంబయ్, చెన్నై, బెంగుళూరు, కోల్‌కతా నగరాలు వాయు, భూమి, నీటి కాలుష్యాలతో అతలాకుతలమవుతున్న అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని అలాంటి ప్రమాదాలు హైదరాబాద్ నగరానికి రాకుండా అభివృద్ధికి ఒక క్రమపద్ధతిలో బాటలు వేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ రైజింగ్ ఉత్సవాలను హెచ్ఎండీఏ మైదానంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నగరంలో పలు అభివృద్ధి పనులకు వర్చువల్ గా ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్ , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "దేశంలోని ప్రధాన నగరాలు ఎదుర్కొంటున్న ప్రమాదకర పరిస్థితులను గమనించే మూసీ నదిని ప్రక్షాళన చేయాలని, నదికి పునరుజ్జీవం చేయాలని సంకల్పించాం. వరదలొస్తే నగరంలో ఎక్కడికక్కడ నీళు నిలిచే పరిస్థితి వచ్చింది. అందుకే నగరంలో 141 ప్రాంతాల్లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ కడుతున్నాం.భవిష్యత్తరాలకు ఒక అద్భుతమైన హైదరాబాద్ నగరాన్ని అందించాలి. అప్పుడే నగరం ప్రపంచ పెట్టుబడులకు వేదిక అవుతుంది. ప్రపంచ పటంలో ఒక అద్భుతమైన నగరంగా నిలబడుతుంది.మనం బాగుపడటానికి ఎవరో వస్తారని చూసుకుంటూ కూర్చుంటే ఈ నగరం వరదలతో ముంచెత్తుతుంది. కాలుష్యం కోరల్లో చిక్కుకుంటుంది. నాలాల ఆక్రమణలను తొలగించాలి. మూసీని ప్రక్షాళన చేయాలి. పారిశ్రామిక కాలుష్యాలు మూసీలో కలవకుండా నియంత్రించాలి.

చెరువులు, కుంటలు, నాలాలను ఆక్రమించుకున్న చోట ఆక్రమణలను తొలగించడానికి హైడ్రా పనిచేస్తుంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షించే తెలంగాణకు మణిహారంగా 35 వేల కోట్ల రూపాయలను వెచ్చించి 360 కిలోమీటర్ల పొడవున రీజినల్ రింగ్ రోడ్డును చేపట్టాం. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు సాధించి రీజినల్ రింగ్ రోడ్డును పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాం.రీజినల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు మధ్యన రేడియల్ రోడ్లు వేయడానికి 15 వేల కోట్ల రూపాయల వ్యయం చేయగలిగితే తద్వారా 60 శాతం తెలంగాణను అభివృద్ధి బాటన పడుతుంది.

ఇబ్రహీంపట్నంలో 250 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ ఏర్పాటు చేస్తున్నాం. అందులో కూరగాయలు, ఫ్రూట్ మార్కెట్, డెయిరీ, పౌల్ట్రీ, మీట్ ప్రొడక్ట్స్ సదుపాయాలు ఉంటాయి. వీటికి అనుబంధంగా కోల్డ్ స్టోరేజీలను నిర్మిస్తాం. ముచ్చర్ల ప్రాంతంలో 40 నుంచి 50 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ఫ్యూచర్ సిటీని ప్రతిపాదించాం. 1 ఏప్రిల్ – 30 నవంబర్ 2023 ఆరు నెల్లతో పోల్చితే 1 ఏప్రిల్ – 30 నవంబర్ 2024 కాలంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ 29 శాతం పెరిగింది.రాజధాని హైదరాబాద్ నగరానికి పెట్టుబడులు, ప్రపంచ పర్యాటకులను ఆకర్షించాలంటే మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరి నుంచి నీటిని తరలింపు, మూసీ ప్రక్షాళన చేయకతప్పదు. ఈ ప్రాజెక్టులన్నింటికీ రాబోయే 4 సంవత్సరాల్లో లక్షన్నర కోట్ల రూపాయలు కావాలి.హైదరాబాద్ నగరమే మన ఆదాయం. ఆత్మగౌరవం. నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు చేస్తున్నాం. ఆ ప్రణాళికల ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులు తీసుకొచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తాం" అని చెప్పారు.

మేరకు మూసీ నది ప్రక్షాళన కోసం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంద న్నారు. రూ.7 వేల కోట్లతో నగరంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, ఫ్లైఓవర్లు, నాలాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాపాలన కోసం తెలంగాణ ప్రజలు ఏడాది క్రితం తీర్పునిచ్చారని, తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. మెట్రో రైలును హైదరాబాద్ తీసుకు వచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని వెల్లడించారు. రూ.35 వేల కోట్లతో 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌ను నిర్మించబోతున్నామన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ అబద్ధాలతో పదేళ్లు గడిపేశారని ఆరోపించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ జాం తదితర సమస్యలతో నివసించడానికి ఇబ్బందికరంగా

మిగితా 3వ పేజీలో

## భవనాల అనుమతులకు ఇక 'బిల్డ్ నౌ'



- భవనాలు, లే అవుట్ల అనుమతుల కోసం కొత్త పోర్టల్'
- అందుబాటులోకి కొత్త ఆన్‌లైన్ విధానం
- లే అవుట్లు, హైరైజ్ భవనాల డ్రాయింగ్ వేగంగా స్ర్కుటినీ

బలగం టీవి, హైదరాబాద్


భవనాలు, లే అవుట్ల అనుమతులకు 'బిల్డ్ నౌ' పేరుతో కొత్త ఆన్ లైన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. 'బిల్డ్ నౌ' పేరుతో ఏర్పాటు చేసిన ఈ విధానాన్ని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు మంగళవారం ప్రారంభించారు.వివిధ వర్గాలకు శిక్షణ ఇచ్చి ఫిబ్రవరి 1 నుంచి బిల్డ్ నౌ సాఫ్ట్‌వేర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. కొత్త విధానంలో డ్రాయింగ్ పరిశీలన, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియ మరింత వేగం కానుందని మంత్రి తెలిపారు. భవనం, లే అవుట్ ప్లాన్‌ను ఆగ్మెంటెడ్ రియాల్టీతో త్రీడీ విధానంతో చూసే అవకాశం కూడా ఉంటుందని వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భవనాలు, లేఅవుట్ల ఆమోదం కోసం నూతన ఏకీకృత ఆన్ లైన్ వ్యవస్థ రూపొందించినట్లు తెలిపారు. లేఅవుట్లు, హైరైజ్ భవనాల డ్రాయింగ్ స్ర్కుటినీలో జాప్యం తగ్గించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుత అప్లికేషన్ లో దరఖాస్తు సమర్పణ, స్టేటస్ ట్రాకింగ్, ఫీజు చెల్లింపు కోసం అనేక ప్లాట్ ఫారమ్‌లను నేవిగేట్ చేయాల్సి వస్తోందని.. దానివల్ల గందరగోళం, జాప్యం జరుగుతోందని తెలిపారు. వీటన్నింటికి పరిష్కారం చూపుతూ భవన నిర్మాణాలు, లేఅవుట్ అనమతులు, ఆక్యుపెన్సీ, టీడీఆర్ సర్టిఫికెట్లతో పాటు అనధికార నిర్మాణాలకు నోటీసులు జారీ వంటి సేవలు ఒకే చోట ఉండేలా నూతన అప్లికేషన్ సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. కొత్త విధానంలో దేశంలోనే అత్యంత వేగంగా.. డ్రాయింగ్, హై రైజ్ భవనాల స్ర్కూటినీ కొన్ని నిమిషాల్లోనే పూర్తవుతుందని చెప్పారు. భవన నిర్మాణాలు, లేఅవుట్లకు సంబంధించిన జీవోలు, సందేహాలు నివృత్తి చేసేందుకు ఏఐ ఆధారిత చాట్ సదుపాయం కూడా ఉంటుందన్నారు.

అగ్మెంటెడ్ రియాలిటీ తో కూడిన 3డీవిజువలైజేషన్ సౌకర్యం కూడా కొత్త అప్లికేషన్ లో ఉంటుందని తెలిపారు. భవన నిర్మాణ నమూనాలను 3డీలో పరిశీలించవచ్చు ప్రణాళికను తనిఖీ చేసి ప్రతి వివరాలను దృశ్యరూపకంగా ధృవీకరించుకోవచ్చునని మంత్రి చెప్పారు. అప్లికేషన్లన్ లో పత్రాలన్నీ బ్లాక్‌చెయిన్ వో భద్రంగా ఉంటాయని తెలిపారు. నాన్ హై రైజ్ భవన నిర్మాణ ప్లాన్ ఆమోదించే సమయం 21 రోజుల నుండి 15 రోజులకు.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ సమయం 15 రోజుల నుండి 10 రోజులకు తగ్గుతుందని మంత్రి తెలిపారు. అధికారులు సైట్ నుండి నేరుగా ఫోటోలు, సెట్‌బ్యాక్, రోడ్డు వెడల్పు వంటి రియల్-టైమ్ డేటాను అప్‌లోడ్ చేయడానికి వీలుంటుందన్నారు. ఏఐ డేటా కో-పైలట్ రియల్ టైమ్ లో సిస్టమ్ పనితీరుపై వివరణాత్మక నివేదికలను అందిస్తుందన్నారు. కొత్త విధానంపై వివిధ వర్గాలకు శిక్షణ ఇచ్చి ఫిబ్రవరి 1 నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీ పరిధిలో ఏడాదిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి వివరించారు.

## ఆ కళాశాలలపై కఠిన చర్యలు

- మంత్రి కోమటిరెడ్డి



బలగం టీవి, హైదరాబాద్

ఇంటర్ కాలేజీల్లో విద్యార్థుల మరణాలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సీరియస్ అయ్యారు. పది రోజుల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం దారుణం అని పేర్కొన్నారు. ర్యాంకుల పేరిట విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసే విధానాలను ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు మానుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న కాలేజీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. విద్యార్థులు అధైర్యపడి క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకొని తల్లితండ్రులకు గర్భశోకం మిగిల్చవద్దని మంత్రి కోరారు. చావు సమస్యకు అంతిమ పరిష్కారం కాదు అని,బతికి సాధించాలని విద్యార్థులకు మంత్రి పిలుపునిచ్చారు. ఇంటర్ విద్యార్థులకు ఏదైనా అత్యవసర సమస్య ఉంటే తన కార్యాలయం మొబైల్ నెంబర్ : 86880 07954 లేదా minister.randbc@gmail.com ఈమెయిల్‌కు తెలియజేయాలని తెలిపారు.

## రైజింగ్ గ్రేటర్ హైదరాబాద్

### రూ. 5,827 కోట్లతో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో అడుగులు వేస్తున్న ప్రజా ప్రభుత్వం అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రూ. 5,827 కోట్లతో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

హైదరాబాద్ రైజింగ్ ఉత్సవంలో భాగంగా నెక్లెస్ రోడ్డు హెచ్ఎండీఏ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు , పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయా అభివృద్ధి ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి గారు వర్చువల్ గా ప్రారంభించారు.

-గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో H-CITI ఫేజ్-1 లో ఇప్పటికే పరిపాలనా అనుమతులను మంజూరు చేసిన రూ. 3446 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.

-నగరంలో రహదారులు, వివిధ జంక్షన్ల సుందరీకరణకు రూ. 150 కోట్లతో వివిధ పనులకు శంకుస్థాపన చేశారు.

-నగరంలో వరదనీరు నిలవకుండా వర్షపు నీటి సంరక్షణ, వరద నీటిని నియంత్రించే పనులకు రూ. 17 కోట్ల అంచనాలతో చేపట్టే పనుల ప్రారంభించారు.

-రూ. 669 కోట్ల అంచనాలతో హైదరాబాద్ జల మండలి అధ్వర్యంలో నిర్మించిన మురుగు నీటిని శుద్ధి చేసే ప్లాంట్లు (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు) ప్రారంభించారు.

మిగితా 3వ పేజీలో

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

# హరీష్‌రావుపై కేసు నమోదు

బలగం టీవి, హైదరాబాద్

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సిద్దిపేటకు చెందిన చక్రధర్ గౌడ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని పంజాగుట్ట పోలీసులకు చక్రధర్ ఫిర్యాదు చేశారు. దీంతో హరీష్ రావుతో పాటు టాస్క్ ఫోర్స్‌లో పనిచేసిన రాధాకిషన్ రావుపై కేసు నమోదు చేశారు. సెక్షన్ 120 (బీ), 386,409,506 , రెడ్ విత్ 34, ఐటీ యాక్ట్ సెక్షన్ల కింద కేసు నమోదైంది.

గతంలో హరీష్ రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసులో డీజీపీకి, జూబ్లీహిల్స్ ఏసీపీకి చక్రధర్ గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అలర్ట్ మెసేజ్ వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదుపై గతంలో రెండుసార్లు పోలీసులు విచారణ చేశారు. హరీష్ రావు తన ఫోన్ ట్యాప్ చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోసారి విచారణకు రావాలని పోలీసులు ఆదేశించడంతో జూబ్లీహిల్స్ ఏసీపీ ముందు చక్రధర్ గౌడ్ విచారణకు హాజరయ్యారు. ఆయన వద్ద ఉన్న ఆధారాలను పోలీసులు పరిశీలించి విచారణ చేశారు.


ఈ సందర్భంగా చక్రధర్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని, తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు ఆపిల్ కంపెనీ ద్వారా తనకు అలర్ట్ మెసేజ్ వచ్చిందని, దీనిపై గతంలో డీజీపీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. గంటన్నర పాటు పోలీసులు విచారణ జరిపి.. స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారని తెలిపారు. అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు బీఆర్ఎస్ పార్టీలో చేరి హరీష్ రావుకు సరెండర్ అవ్వాలని... లేకపోతే అక్రమ కేసులు పెడతామని బెదిరింపులకు దిగారని ఆరోపించారు. తన వ్యక్తిగత ఫోన్‌తో పాటు తన భార్య, డ్రైవర్, తమ కుటుంబ సభ్యుల ఫోన్లు అన్ని ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం ఇచ్చానని, తాము చెప్పినట్లు వినకపోతే తన కుటుంబాన్ని అంతం చేస్తామంటూ అప్పటి ట్రాన్స్‌పోర్టు డీసీపీ రాధా కిషన్ రావు బెదిరింపులకు దిగారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌పై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేసి పోరాటం చేస్తున్నానని, న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టులో కూడా పిటిషన్ వేసి పోరాటం చేస్తానన్నారు.

## ఉమ్మడి నల్గొండ జిల్లాలో చెక్ డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు

బలగం టీవి, హైదరాబాద్

ఉమ్మడి నల్గొండ జిల్లాలో రూ.143 కోట్లతో 18 చెక్ డ్యాంలను నిర్మించడానికి నీటిపారుదల శాఖ నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట, భువనగిరి, నల్గొండ జిల్లాల్లో ఈ చెక్ డ్యాంలను నిర్మించనున్నారు. వీటి నిర్మాణానికి బీఆర్ఎస్ హయాంలోనే నిధులు మంజూరు చేశారు. వివిధ కారణాలతో పనులు జరగలేదు. ఈ నేపథ్యంలో మరోసారి అంచనాలను సవరించి నిధులను మంజూరు చేశారు. వీటిని తుంగతుర్తి, సూర్యాపేట, దేవరకొండ నియోజకవర్గాల్లో వీటిని నిర్మిస్తారు.

## లక్ష తప్పుడు కేసులు పెట్టించినా ప్రశ్నించడం ఆపను



బలగం టీవి, హైదరాబాద్

రేవంత్‌రెడ్డీ.. నీకు చేతనైంది ఒక్కటే.. తప్పుచేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడం' అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు విరుచుకుపడ్డారు. 'నువ్వెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రశ్నించడం కొనసాగిస్తూనే ఉంటా' అని హెచ్చరించారు.'నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, ప్రజల పక్షాన ప్రశ్నలు సంధిస్తున్నందుకు, నీ నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు భరించలేక నాపై అక్రమ కేసులు బనాయిస్తున్నవ్.. నువ్వు లక్ష కేసులు పెట్టినా సరే.. ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపబోను' అంటూ మంగళవారం ఎక్స్ వేదికగా తెగేసిచెప్పారు.

'అడుగడుగునా నువ్వు చేస్తున్న అన్యాయాలను నిలదీస్తున్నందుకు, నీ నిజ్వస్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నందుకు, ప్రజల పక్షాన నీమీద ప్రశ్నలు సంధిస్తున్నందుకు భరించలేక, సహించలేక నామీద అక్రమ కేసులెన్నో బనాయిస్తున్నావు.నీకు చేతనైంది ఒక్కటే.. తప్పు చేసి దబాయించడం, తప్పుడు కేసులు బనాయించడం.

రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేసినవు అని అన్నందుకు యాదగిరి గుట్ట పోలీసు స్టేషన్ లో తప్పుడు కేసు పెట్టించినవు. ఇచ్చిన హామీలను ఎగవేస్తున్న నిన్ను ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నందుకు బేగం బజార్ పోలీసు స్టేషన్ లో తప్పుడు కేసు పెట్టించినవు. సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో నా మీద సంబంధం లేని కేసు పెట్టించినవు. పార్టీ కార్యక్రమంలో మాట్లాడితే కోడిగుడ్డుమీద ఈకలు పీకి, తలాతోక లేని కేసొకటి మానకొండూరులో అక్రమ కేసు పెట్టించినవు. నీ రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక ఇవాళ పంజాగుట్ట స్టేషన్ లో మరో తప్పుడు కేసు పెట్టించినవు. నువ్వు లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, నేను ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపను. ప్రజా కోర్టులో, ప్రజా తీర్పుతో నీకు తగిన శిక్ష పడేంత వరకు ఆగను" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## హైడ్రాకు రూ.50 కోట్ల నిధులు మంజూరు

బలగం టీవి, హైదరాబాద్

హైడ్రాకు రూ.50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైడ్రా ఆఫీసు నిర్వహణ, వాహనాల కొనుగోలు.. కూల్చివేతల చెల్లింపుల కోసం రూ.50 కోట్లు మంజూరు చేసినట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. హైడ్రాకు నిధుల కేటాయింపుపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు, రంగారెడ్డి జిల్లా బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలో పార్క్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని మంగళవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. వివరాల్లోకెళ్తే.. అల్మాస్ గుడలోని 5వ డివిజన్ లో వేంకటేశ్వర కాలనీలో ఓ పార్కు ఉంది. అయితే ఆ పార్కులో పిల్లల ఆట పరికరాలను తొలగించి ఆ స్థలం తనదంటూ ఓ వ్యక్తి కంటైనర్ ఏర్పాటు చేశాడు. దాంతో స్థానికులు రెండు రోజుల క్రితం హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు స్థానికంగా లేఅవుట్లను పరిశీలించి.. అది పార్కు స్థలంగా గుర్తించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం అధికారులు కంటైనర్ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఇదిలా ఉండగా ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే అధికారులు చర్యలు తీసుకొని, పార్కు స్థలాన్ని కాపాడినందుకు వెంకటేశ్వర కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లులాంటివి..




- **వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా..**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ , వేములవాడ**

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నాడని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.మంగళవారం వేములవాడ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవల్లో ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ హాజరై ,ఇటీవల నూతనంగా రుద్రంగి,కోనరావుపేట మండలాలకు మంజూరు అయిన అంబులెన్స్లను జెండా ఊపి ప్రారంభించారు..

ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ సరిగ్గా ఏడాది క్రితం డిసెంబర్ మూడు రోజు రాష్ట్రంలో ప్రజా పాలనకు నాంది పలికింది అని, ప్రజా ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా పాలన నేటికి సంవత్సరం పూర్తి చేసుకుంది అని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విజయోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నామని,ఇప్పటికే వరంగల్లో మహిళల పండగ, మహబూబ్నగర్లో రైతుల పండుగ నిర్వహించామని,బుధవారం పెద్దపల్లిలో యువత కోసం పండగ నిర్వహించబోతున్నామని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలో పండగ వాతావరణ ర్యాలీ చేపట్టడం జరిగింది అని అన్నారు. మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బందికి హెల్త్ మెగా హెల్త్ క్యాంపు ఏరియా ఆసుపత్రిలో నిర్వహించి అన్ని రకాల పరీక్షలు నిర్వహించడం జరిగింది అని అన్నారు.రుద్రంగి, కోనరావుపేట మండలాలకు మంజూరు అయిన అంబులెన్స్లను నేడు ప్రారంభించడం జరిగింది అని,గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంబులెన్స్ లను ప్రారంభించడం జరిగింది అని అన్నారు.గత నెల 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ పట్టణంలో 1000 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారని అన్నారు.రూ. 76 కోట్ల ద్వారా రాజన్న భక్తులు ఎంతగానో ఎదురుచూసే ఆలయ విస్తరణకు భూమి పూజ నిర్వహించని,47 కోట్లతో రోడ్డు వెడల్పు, తిప్పాపూర్ మూడవ బ్రిడ్జి నిర్మాణానికి ఆరు కోట్లు నిర్వాసితులకు ఇచ్చి పనులు ప్రారంభించడం జరుగుతుంది అని అన్నారు.

రూ. 3 కోట్లతోగుడి చెరువు, మూలవాగులలో మురికి నీరు కలవకుండా నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని,మల్కాపేట ప్యాకేజ్ 9, మర్రిపల్లి రిజర్వాయర్ కలికోట సూరమ్మ రిజర్వాయర్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు.ప్రజా ప్రభుత్వం లో రైతన్నలకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేశామని,ఇప్పటికే రాష్ట్రంలో మహిళా తల్లులకు ఉచిత ప్రయాణం కల్పించమని,ఆరోగ్యశ్రీ పరిమితి పది లక్షల వరకు పెంపు,200 యూనిట్లకు ఉచిత కరెంటు ఇస్తున్నామని అన్నారు.వైద్య చికిత్స అందించడానికి ఎల్ఓసి లను కూడా మంజూరు చేయడం జరుగుతుంది అని,ఇప్పటికే 50 కోట్లు తో యారన్ డిపో మంజూరు,ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్ సేవలు ప్రారంభించబోతున్నామని అన్నారు.మన ప్రాంతంలో ప్రజా అవసరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో తీర్చే బాధ్యత తీసుకున్నానని అన్నారు.విద్యార్థులకు మెరుగైన విద్య అందించేలా మేడిపల్లి మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేయించడం జరిగింది అని అన్నారు.నాణ్యమైన విద్యుత్ను అందించేందుకు మన ప్రాంతంలో అనేక సబ్స్టేషన్ను మంజూరు చేయించడం జరిగింది అని,నియోజకవర్గంలో ఏ రంగాన్ని విస్మరించకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నామని అన్నారు.

నియోజకవర్గంలో ఎక్కడ ఏ పని ఉన్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మరియు మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వాటిని నెరవేర్చడం జరుగుతుందిఅని అన్నారు.మహిళా తల్లులను కోటీశ్వరులు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తున్నారు అని అన్నారు.రాష్ట్రంలో ఇప్పటివరకు 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందిఅని, బుధవారం పెద్దపల్లిలో మరో తొమ్మిది వేల ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం జరుగుతుంది అని అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహిస్తే,మళ్లీ మొన్న ప్రజా ప్రభుత్వంలో 12 వేల పై చిలుకు ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని అన్నారు.



## నకిలీ ఏజెంట్ అరెస్టు రిమాండ్‌కు తరలింపు

**బలగం టీవీ, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోదుగల్ గ్రామంలోని పలువురు వ్యక్తుల వద్ద లోడ్లు ఇప్పిస్తానని మోసం చేసిన నకిలీ ఏజెంటును మంగళవారం రోజు అరెస్టు చేసి రిమాండ్కు తరలించామని ఎస్సై గణేష్ తెలిపారు. వారి వివరాల ప్రకారంవేములవాడ మండలం నెమలి గుండ్ల పల్లె గ్రామానికి చెందిన చంద్రగిరి రాహుల్ అనే వ్యక్తి వేములవాడ పట్టణంతో పాటు పోతుగల్ గ్రామంలోని సుమారు 20 మంది వద్ద బ్యాంకు లోన్, ఫైనాన్స్ లోన్ పలు లోన్లు ఇప్పిస్తానని భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు అతడిని మంగళవారం రోజు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు. అలాగే ఎవరైనా సరే అమాయక ప్రజల వద్ద నకిలీ ఏజెంట్గా చలామణి అవుతూ ప్రజలను అక్రమ వసూళ్లకు పాల్పడితే నేరుగా మమ్మల్ని సంప్రదించాలని ఎస్సై గణేష్ తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**బలగం టీవీ , తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలని గ్రామానికి చెందిన బెతి జయ కి రూ.25000 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గడ్డం మధుకర్ చోటు చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చోటు మాట్లాడుతూ నిరుపేదల కుటుంబాల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో అండగా ఉంటుందని అన్నారు.ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు.లబ్దిదారులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ జే టోనీ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీరాం నరేష్, మాజీ వార్డు సభ్యులు గోరింటల మాధవి రాజమల్లు, దూస మహేందర్, గాలి విరేశం, జంగంపల్లి భాగ్యలక్ష్మి, అడిగొప్పుల యమున, బొల్లి పద్మ, గజ్జెల్లి అరుణ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ బీసీ సంఘం మండల అధ్యక్షుడిగా ఎగుర్ల కర్ణాకర్ నియామకం

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మ్యాకల పరుశురాం ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి మండల అధ్యక్షులుగా ఎగుర్ల కర్ణాకర్ ని నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బైరగోని గోపి గౌడ్, అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్ ,వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ అరుణ్ తేజ చారి, వేములవాడ రూరల్ మండలం అధ్యక్షులు దానే తిరుపతి, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.



## మురికి కాల్వకు అడ్డుగోడ

- **పలు సమస్యలను పట్టించుకోని అధికారులు**

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామంలోని రోడ్ నెంబర్ 3 లో ఒక ఇంటి యజమాని మురికి నీళు వెళ్లకుండా మురికి కాల్వకు ఇరువైపులా అడ్డుగోడ కట్టి నెలలు గడుస్తున్నా కూడా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. వివరాల్లోకి వెళ్తే గ్రామంలో పలు సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లి విన్నవించినా కూడా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అలాగే గ్రామంలోని రోడ్ నెంబర్ మూడు లో మురికి కాల్వకు ఇరువైపులా మురికి నీరు పోకుండా సిమెంటు ఇటుకలతో అడ్డుగోడ కట్టి, మోరిని మట్టితో నింపి చదును చేశాడని, ఇప్పటికైనా మండల అధికారులు కానీ స్పెషల్ అధికారి మరియు గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి మురికి నీరు యధావిధిగా పోయే విధంగా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.





## వేడుకగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..

**బలగం టీవీ , సిరిసిల్ల**

కొనారావుపేట మండలం కొలనూర్ గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1995-96 బ్యాచ్ 7 వ తరగతి విద్యార్థులు 25 ఏళ్లు పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని గురువులతో కలిసి వైభవంగా నిర్వహించారు. 30 మంది పూర్వ విద్యార్థులు అందరు ఒకే వేదికపై కలుసుకొని అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం దివంగతులైన విద్యార్థులు రాము, కొండల్ రెడ్డి ల ఆత్మశాంతి కోసం నివాళులర్పించారు. అప్పటి ఉపాధ్యాయులు లక్ష్మణ్, సత్యనారాయణ, కృష్ణ మూర్తిలకు పూర్వ విద్యార్థులు పాదాభివందనం చేశారు. అనంతరం శాలువ, పూలమాలలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు.

### వికలాంగుల సంక్షేమానికి

# రూ. 87.81 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

- మంత్రి సీతక్క




**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచ వికలాంగుల దినోత్సవము రవీంద్ర భారతిలో ఘనంగా జరిగిందీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళ, శిశు సంక్షేమ శాఖ, పంచాయితి రాజ్ శాఖ మంత్రి వర్యులు సీతక్క, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య పాల్గొని ప్రసంగించారు

మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న వికలాంగులు అందరు ఈ పండుగ రోజు లా జరుపుకోవడం చారిత్రక అంశం అన్నారు వైకల్యం తో బాధపడకుండా ఆత్మ స్థైర్యం తో ప్రపంచాన్ని జయించిన వికలాంగులు మానవాళి కి ఆదర్శం అన్నారు కేంద్రం పెన్షన్ నీ 300 ల నుండి 3000 వేలకి పెంచాలి అన్నారు. కేంద్రము లో అధికారం లో ఉన్న బిజెపి ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా పెంచక పోవడం దారుణమన్నారు. త్వరలోనే కేంద్రం పెన్షన్ పెంచేలా కేంద్రమంత్రులు , బిజేపి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలు బిజేపి పై వత్తిడి తేవాలి అన్నారు తాము త్వరలోనే పెన్షన్ పెంచడం తో పాటు వికలాంగులకు ఆర్దికంగా ఆదుకుంటామని అన్నారు ఇప్పటికే జాబ్ పోర్టల్ కూడా ప్రారంభించామని రాబోయే 4 ఏండ్ల లో ఎన్నడు లేని విధంగా వికలాంగుల సంక్షేమం లో విప్లవాత్మకమైన మార్పులు తెస్తామని అన్నారు

ఎన్నడు లేని విధంగా ఈ సారి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మ్యారేజ్ ఇన్సెంటివ్ లకు 10 కోట్ల రూపాయలు కేటాయింపులు చేసిందనీ మొత్తం వికలాంగుల సంక్షేమం కి 87 కోట్ల 81 లక్షల రూపాయలు కేటాయించిందని అన్నారు , ఉద్యోగాలలో 4%, సంక్షేమము లో 5% రిజర్వేషన్ అమలు పరుస్తామని తెలియజేశారు

ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ

వికలాంగుల సంక్షేమ శాఖ నీ, వికలాంగుల కార్పొరేషన్ నీ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ నే అని, మొదట పెన్షన్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ నే అనీ, నెలసరి పెన్షన్ నీ అమలు చెసింది కాంగ్రెస్ పార్టీ నే అనీ, ఉపాధి హామీ పథకం తెచ్చి క వికలాంగులకు 100 రోజులు పని కల్పించింది కాంగ్రెస్ పార్టీ నేనని, వికలాంగులు హక్కుల చట్టం -2016 నీ ఏకసభ్య కమిషన్-2011 ద్వారా రూపొందించింది కాంగ్రెస్ పార్టీనే అనీ,వికలాంగుల కీ విద్య లో, ఇండ్లలో రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ నే అనీ అసలు ఇప్పటి వరకు వికలాంగుల కి అమలు అవుతున్న చట్టాలు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఖచ్చితంగా రాబోయే 2 నెలల్లో వికలాంగులకు వేల మందికి ఉచితంగా 40% వైకల్యం కి సహాయ ఉపకరణాలు పంచుతామని తెలియ జేశారు గత ప్రభుత్వ హయం లో నెలకొన్న వికలాంగుల సమస్యలు ,వికలాంగ ఉద్యోగుల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు, వికలాంగుల కార్పొరేషన్ లో మొదటి 100 రోజుల్లోనే మేనేజ్మెంట్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేసి సమూల మార్పులు చేస్తూ ప్రక్షాళన చేశాం అన్నారు

ముఖ్య మంత్రి వర్యులు వికలాంగుల ఆత్మ బంధువు రేవంత్ రెడ్డి రుద్యోగులను ఉద్యోగులుగా మార్చే ప్రాజా పాలన తెచ్చారని ఈ ఒక్క సంవత్సరం లోనే 87 మందీ ప్రభుత్వ హాస్టళ్ల లో ఉండే వికలాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన వికలాంగుల అందరినీ మంత్రి , ఛైర్మెన్ అభినందనలు తెలిపారు వివిధ రంగాలలో అద్భుత విజయాలు సాధించి రాష్ట్రస్థాయి అవార్డ్స్ పొందిన 21 మందీ వికలాంగుల ను మంత్రీ , ఛైర్మన్ మెమెంటో, ప్రేజ్ మనీ అండ్ శాలువాతో ఘనంగా సన్మానించారు ఈకార్యక్రమం లో శాఖ సెక్రటరి అనితా రామ చంద్రన్, శాఖా డైరెక్టర్ శైలజ, జీఎంప్రభంజన్ రావ్ అండ్ వేల మందీ వికలాంగులు , వివిధ వికలాంగుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వారీ కార్య వర్గాలు పాల్గొన్నాయి

# హైదరాబాద్ అభివృద్ధికి క్రమపద్ధతిలో బాటలు

**(మొదటి పేజీ తరువాయి)**

మారిందన్నారు. అందుకే హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారం 29 శాతం పెరిగిందన్నారు. హైడ్రా కేవలం అక్రమ నిర్మాణాలను మాత్రమే కూల్చుతోందని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవం ముందుకు వెళ్లకుండా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణకు, హైదరాబాద్‌కు నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు.

మెట్రోకు రూ.35 వేల కోట్లు, రీజినల్ రింగ్ రోడ్డుకు రూ.35 వేల కోట్లు ఖర్చవుతాయని, కేంద్రం నుంచి కిషన్ రెడ్డి ఎంత మేరకు నిధులు తీసుకువస్తారో చెప్పాలన్నారు. ప్రధాని మోదీ గుజరాత్‌కు నిధులు తీసుకెళుతుంటే కిషన్ రెడ్డి చూస్తూ ఉన్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేస్తే కాంగ్రెస్‌కు పేరొస్తుందని బీఆర్ఎస్ ఆందోళన చెందుతోందని విమర్శించారు.

# రైజింగ్ గ్రేటర్ హైదరాబాద్

**(మొదటి పేజీ తరువాయి)**

-తాగునీటి సరఫరాకు అవుటర్ రింగ్ రోడ్డు ఓఆర్ఆర్ చుట్టూ వివిధ ప్రాంతాల్లో రూ. 45 కోట్లతో చేపట్టిన 19 రిజర్వాయర్లను ప్రారంభించారు.

-హైదరాబాద్ రోడ్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధ్వర్యంలో గ్రేటర్ సిటీలో రూ. 1500 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసే ప్యాకేజీతో పాటు గతంలో పెండింగ్‌లో ఉన్న పనులకు శంకుస్థాపన చేశారు.

-అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనుసంధానంతో కొత్త ఆన్‌లైన్‌లో బిల్డింగ్ అప్రూవల్, లేఅవుట్ అప్రూవల్ సాఫ్ట్‌వేర్‌ను సీఎంగారు లాంఛనంగా ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి నుంచి ఈ విధానం అమలులోకి రానుంది.

## ఎన్‌కౌంటర్‌పై నివేదిక ఇవ్వండి

**బలగం టీవి, హైదరాబాద్**

ఏటూరునాగారం సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌తోపాటు తదనంతరం చర్యలపై నివేదిక సమర్పించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. పిటిషనర్ ఐలమ్మ భర్త మృతదేహాన్ని తదుపరి విచారణ వరకు భద్రపర్చాలని, మిగిలిన 6 మృతదేహాలను వారి బంధువులకు అప్పగించాలని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 5కి వాయిదా వేశారు.

## సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ మన్మోహన్

**బలగం టీవి, హైదరాబాద్**

ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ఆయన నియామకం అమలులోకి వస్తుందని అధికారిక నోటిఫికేషన్ పేర్కొంది.జస్టిస్ మన్మోహన్‌ను సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించాలని సుప్రీంకోర్టు కొలీజియం నవంబర్ 28న సిఫార్సు చేయగా రాష్ట్రపతి ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా విభూ బఖ్రూ నియమితులైనట్లు న్యాయశాఖ తెలిపింది.

## పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మంగళవారం పెద్దపెల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రూ.82 కోట్ల విడుదల చేస్తూ జీవో విడుదల చేసింది. ఎన్నికల సమయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు బైపాస్ రోడ్డు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పెద్దపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా నిధులు విడుదలయ్యాయి. బైపాస్ కు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి అందుకు సహకరించిన మంత్రి శ్రీధర్ బాబుకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు కృతజ్ఞతలు తెలియజేసారు.

## రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డ్ సభ్యుడిగా ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర వన్య ప్రాణి సంరక్షణ బోర్డులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ కు చోటుదక్కింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఛైర్మెన్ గా, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వైస్ ఛైర్మెన్ గా ఉన్న ఈ కమిటీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ను సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. కమిటీలో మరో ముగ్గురు ఎమ్మెల్యే లను సభ్యులుగా నియమించారు. మూడు సంవత్సరాల పాటు ఈ కమిటీ కొనసాగుతుంది. సభ్యులకు ప్రభుత్వం టిఎ, డిఎ ఇతర భత్యాలు కల్పిస్తుంది. వన్య ప్రాణి సంరక్షణకు ఈ బోర్డు ప్రభుత్వానికి సలహాలు ఇస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసే బాధ్యత కలిగి ఉంటుంది. కమిటీలో మరో ముగ్గురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీతో పాటు మరో పన్నెండు మంది రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు కూడా సభ్యులుగా ఉంటారు. కవ్వాళ టైగర్ జోన్ పరిధిలో ఉన్న ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ కు ఈ కమిటీలో చోటు దక్కడంతో ఈ ప్రాంత సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయి. వన్యప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడిగా ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ నియామకం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.

## కానిస్టేబుల్ హత్య కేసులో తమ్ముడి రిమాండ్

**బలగం టీవి, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్‌లో సోమవారం ఉద యం మహిళా కానిస్టేబుల్ నాగమణిని హత్య చేసిన ఆమె సోదరుడు పరమేశ్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ తెలిపారు. భూ సమస్యలతోపాటు కులాంతర వివాహం చేసుకున్నందుకే అక్కను కడతేర్చినట్టు పోలీసుల విచారణలో తేలింది.

## పుష్ప-2 చిత్రం విడుదలకు గ్రీన్ సిగ్నల్

- పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

**బలగం టీవి, హైదరాబాద్**

పుష్ప 2' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న వేళ చిత్రాన్ని నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు కొట్టివేసింది. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో తీసిన 'పుష్ప 2 చిత్రం' విడుదలను నిలిపివేయాలంటూ శ్రీశైలం అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సెన్సార్ బోర్డు తరపున డిప్యూటీ సొలిసిటర్ జనరల్ హైకోర్టులో వాదనలు వినిపించారు. మార్పులు సూచించిన తర్వాతే సినిమా విడుదలకు అనుమతించామని కోర్టుకు తెలిపారు. ఊహాజనిత ఆరోపణల ఆధారంగా చిత్రం విడుదల నిలిపివేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు సమయం వృథా చేసినందుకు పిటిషనర్‌కు జరిమానా(ఫైన్) విధించిన న్యాయస్థానం ఆ మొత్తాన్ని స్వచ్ఛంద సంస్థకు అందజేయాలని ఆదేశించింది.

అలాగే పుష్ప 2 సినిమాకు అధిక మొత్తంలో టికెట్ ఛార్జీలు వసూలు చేయడాన్ని అడ్డుకోవాలని పిటిషన్ పై విచారించిన న్యాయస్థానం చివరి నిమిషంలో సినిమా రిలీజును ఆపలేమని మంగళవారం ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. పుష్ప 2 సినిమా టికెట్ ధరల పెంపు వివాదంపై హైకోర్టులో విచారణ జరిగింది. బెనిఫిట్ షో పేరుతో 800 రూపాయలు వసూలు చేయడం అన్యాయమని, బెనిఫిట్ షో ద్వారా వచ్చే డబ్బును ఎక్కడికి మళ్లిస్తున్నారో తెలియాల్సిన అవసరం ఉందని పిటిషనర్ సతీష్ కోరారు. దీనిని విచారించిన తెలంగాణ హైకోర్టు చివరి నిమిషంలో సినిమా విడుదలను అడ్డుకోలేమంటూ పుష్ప 2 సినిమా విడుదలకు క్లియరెన్స్ ఇచ్చింది. ఈ మేరకు విడుదల చేసుకునేందుకు మైత్రీ మూవీ మేకర్స్‌కు అనుమతి ఇచ్చింది. అదే సమయంలో బెనిఫిట్ ద్వారా వచ్చే కలెక్షన్ల వివరాలను తమకు తెలియజేయాలని నిర్మాతలను ఆదేశించింది. బెనిఫిట్ షో వసూళ్ల పూర్తి వివరాలు రెండు వారాల్లో సమర్పించాలని మైత్రి మూవీస్ ను ఆదేశించింది. అలాగే టికెట్ ధరల పెంపు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవోలను సైతం పరిశీలిస్తామని న్యాయస్థానం తెలిపింది.

## చెరువుల పరిరక్షణకు కఠిన నిర్ణయాలు తప్పవు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

**బలగం టీవి, హైదరాబాద్**

కొంతమంది ఇబ్బందిపడినప్పటికీ చెరువులు, నాలాల రక్షణలో కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన జియో స్మార్ట్ ఇండియా రెండో సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జియో సైన్స్ ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైందన్నారు. పారిశ్రామిక రంగాలతో పాటు ప్రభుత్వాలకు ఈ జియో స్పేషియల్ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. జియో స్పేషియల్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ప్రధానమైనదన్నారు.

శాటిలైట్ మ్యాప్ డేటా బేస్ ద్వారా హైడ్రా ఆయా ప్రాంతాల్లోని చెరువులను గుర్తిస్తోందన్నారు. ఇది చెరువుల సంరక్షణ కోసం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. మ్యాప్ ద్వారా ఆక్రమణలను గుర్తించి తొలగిస్తున్నట్లు చెప్పారు. నాలాలు ఆక్రమణకు గురై వాటి మధ్య ఇంటర్ కనెక్టివిటీ పోయి వ్యర్థ జలాలు చెరువుల్లో కలుస్తున్నాయన్నారు.

# అంధుల టీ20 ప్రపంచ ఛాంపియన్ పాకిస్తాన్



**బలగం టీవి, ముంబై**

అంధుల క్రికెట్ జట్టు టి20 ప్రపంచకప్ టైటిల్‌ను పాకిస్తాన్‌జట్టు కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్లో పాక్ 10వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. ముల్తాన్ వేదికగా జరిగిన ఫైనల్లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 139పరుగులు చేసింది. ఆరిఫ్ హుస్సేన్(54) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పాక్ బౌలర్లలో బాబర్ అలీ రెండు, మొహమ్మద్ సల్మాన్, మతివుల్లా తలో వికెట్ దక్కించుకున్నారు. ఆ లక్ష్యాన్ని పాకిస్తాన్ కేవలం 11 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ నిసార్ అలీ అజేయమైన అర్థ సెంచరీతో(72)కి తోడు మరో ఓపెనర్ మొహమ్మద్ సఫ్దార్(47నాటౌట్) గెలుపులో కీలకపాత్ర పోషించారు. 12ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో పాక్ టైటిల్ గెలవడం ఇదే తొలిసారి.

## కొండగట్టులో వరుణ్‌తేజ్ పూజలు

**బలగం టీవి, హైదరాబాద్**

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని సినీ హీరో వరుణ్‌తేజ్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామి సమక్షంలో గోత్రనామాలు చెబుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో స్వామివారి జ్ఞాపికగా చిత్రపటాలను ఈవో రామకృష్ణారావు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించగా, ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ మహిమాన్వితమైన కొండగట్టు ఆంజనేయస్వామిని హనుమాన్‌దీక్షలో దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కొండగట్టు ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని తెలుసుకున్నట్లు చెప్పారు.



## శివాజీ మహారాజ్‌గా రిషబ్ శెట్టి

**బలగం టీవి, హైదరాబాద్**

రిషబ్ శెట్టి ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో జై హనుమాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా మరో క్రేజీ బయోపిక్‌తో అందరినీ సర్‌ప్రైజ్ చేస్తున్నాడు. రిషబ్ శెట్టి నటిస్తోన్న బయోపిక్ శివాజీ మహారాజ్. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్.ఖడ్గం చేత బట్టిన శివాజీ మహారాజ్‌గా వీరత్వం ఉట్టిపడే లుక్‌లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాడు రిషబ్ శెట్టి. లెజెండరీ మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథ నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా రాబోతున్న ఈ మూవీని సందీప్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నాడు. అంతేకాదు ఈ చిత్రాన్ని 2027 జనవరి 1న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇది సినిమా కంటే ఎక్కువగా ఉండబోతుంది. అపారమైన అసమానతలను అధిగమించి.. మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదురించి శాశ్వతమైన వారసత్వాన్ని సృష్టించిన యోధుడికి నివాళిగా వస్తోందని మేకర్స్ తెలియజేశారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ రానుంది.






## ‘గోదారి గట్టు మీద రామ చిలకవే’

**బలగం టీవి, హైదరాబాద్**

విక్టరీ వెంకటేష్ – అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ ‘సంక్రాంతికి వస్తున్నాం’. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేశారు. ‘గోదారి గట్టు మీద రామ చిలకవే’ అంటూ సాగే ఈ పాటను ఒకప్పటి ఫేమస్ సింగర్ రమణ గోగులతో పాడించారు. సుమారు 18 ఏళ్ళ తర్వాత రమణ గోగుల.. వెంకటేష్ సినిమాకు పాట పాడటం విశేషం. సాంగ్ కు సంబంధించి లిరికల్ వీడియో రిలీజ్ చేయగా.. ఈ సాంగ్ క్యాచీ లిరిక్స్ తో ఆకట్టుకునేలా ఉంది. ముఖ్యంగా రమణ గోగుల వాయిస్ ఈ పాటకు యాడ్ అవ్వడం మరింత ప్లస్ అయింది. తెలంగాణ ఫోక్ సింగర్ మధుప్రియ రమణ గోగులతో కలిసి ఈ పాట ఆలపించడం విశేషం. ఇక ఈ పాటలో వెంకటేశ్, ఐశ్వర్య రాజేష్ ల డ్యాన్స్ హైలైట్ గా నిలిచింది. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాలో వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ కథానాయికలుగా నటిస్తున్నారు. జనవరి 14 న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఏపీలో ‘పుష్ప’ టికెట్ రేట్ల పెంపు

**బలగం టీవి, అమరావతి**

అల్లు అర్జున్, రష్మిక జంటగా నటించిన పుష్ప–2 సినిమా ఈనెల 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది. ఇందులో భాగంగా ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం టికెట్ ధరలను పెంచగా ఇప్పుడు ఏపీ ప్రభుత్వం కూడా పుష్ప–2కు ధరల పెంపునకు అనుమతిచ్చింది. డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటలకు బెనిఫిట్ షోతో పాటు, అర్ధరాత్రి 1 గంట షోలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు బెనిఫిట్ షోలకుగాను ఏపీ వ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్‌లలో ఏదైనా సరే టికెట్ ధర రూ. 800గా నిర్ణయించింది. ఈ ధరకు జీఎస్టీ అధనంగా ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. డిసెంబర్ 5న ఆరు షోలకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్‌లలో లోయర్‌క్లాస్ రూ.100, అప్పర్ క్లాస్ రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచారు. ఇక్కడ కూడా జీఎస్టీతో కలిపి టికెట్లు కొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ధరలు అన్నీ కూడా ప్రస్తుతం ఉన్న టికెట్ ధరలకు అదనంగా యాడ్ అవుతుందని, డిసెంబర 17 వరకు మాత్రమే పెంచిన ధరలు వర్తిస్తాయని ఏపీ సర్కార్ వెల్లడించింది.




## కోచ్ అచ్రేకర్ స్మారకాన్ని ఆవిష్కరించిన సచిన్

**బలగం టీవి, ముంబై**

సచిన్ టెండూల్కర్ చిన్ననాటి కోచ్ రమాకాంత్ అచ్రేకర్ స్మారకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. శివాజీ పార్క్‌లో ఆయన జయంతి సందర్భంగా ఈ స్మారకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ థాకరే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచిన్ టెండూల్కర్ మాట్లా డుతూ.. క్రికెట్‌కు, తన జీవితానికి ఎంతో మేలు చేసిన ఆ మహనీయుని స్మారకాన్ని ఆవిష్కరించి, నివాళి అర్పించే అవకాశం రావడం తన అదృష్టమని అన్నారు. అచ్రేకర్ అందించిన సేవలకు గుర్తింపుగా 1990లో ఆయనకు ప్రతిష్ఠాత్మక ద్రోణాచార్య, 2010లో పద్మశ్రీ పురస్కాలు దక్కాయి. 2019 జనవరి లో అచ్రేకర్ మరణించారు. అచ్రేకర్ సచిన్‌తో పాటు వినోద్ కాంబ్లీ, సంజరు బంగర్, రమేశ్ పవార్, అజిత్ అగార్కర్ లాంటి ఎంతో మందిని క్రికెటర్లను తీర్చిదిద్దారు.




## పెండ్లి కూతురు కానున్న సింధు

**బలగం టీవి, హైదరాబాద్**

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు త్వరలో పెళ్లి కూతురు కాబోతోంది. హైదరాబాద్‌కు చెందిన 29 ఏళ్ల వెంకట దత్త సాయిని సింధు మనువాడనుంది. వీరి వివాహం ఈనెల 22న ఉదయ్‌పూర్‌లో అంగరంగా వైభవంగా జరగనుంది. ఈ విషయాన్ని సింధు తండ్రి పీవీ రమణ వెల్లడించారు. కాగా, సింధు పెళ్లి చేసుకునే వెంకట దత్త సాయి.. పోసిడెక్స్ టెక్నాలజీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ రెండు కుటుంబాలకు ఎప్పటినుంచో పరిచయం ఉంది. ఆ పరిచయం కాస్తా ఇప్పుడు బంధుత్వంగా మారబోతోంది. ‘మా రెండు కుటుంబాలకు ఎప్పటి నుంచో పరిచయం ఉంది. కానీ నెల క్రితమే పెళ్లి ఖాయమైంది. జనవరి నుంచి సింధు వరుస టోర్నీలు ఆడబోతోంది. అందుకే సాధ్యమైనంత తొందరగా పెళ్లి చేయాలని భావించాం. డిసెంబర్ 22న పెళ్లి వేడుక జరిపించేయాలని ఇరు కుటుంబాలు నిర్ణయించుకుని ముహూర్తం పెట్టించాం. 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఉంటుంది. వచ్చే సీజన్ చాలా ముఖ్యమైనది కాబట్టి సింధు త్వరలోనే ప్రాక్టీస్ కూడా మొదలుపెడుతుంది’ అని ఆమె తండ్రి పీవీ రమణ తెలిపారు. ఇక డిసెంబర్ 20న సింధు పెళ్లి వేడుకలు మొదలు కానున్నాయి.



## న్యూజిలాండ్‌కు 3 డబ్ల్యుటీసీ పాయింట్లు కోత

**బలగం టీవి, హైదరాబాద్**

అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు షాక్ ఇచ్చింది. క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు గాను ఇరుజట్లకు మ్యాచ్ ఫీజ్‌లో 15 శాతం కోతతోపాటు మూడు డబ్ల్యూటిసి పాయింట్ల కోత విధించింది. దీంతో న్యూజిలాండ్ డబ్ల్యూటిసి ఫైనల్‌కు చేరే అవకాశాలు దెబ్బతిన్నాయి. తాజా పెనాల్టీ అనంతరం డబ్ల్యూటిసి పాయింట్ల పట్టికలో న్యూజిలాండ్ ఐదో స్థానానికి పడిపోగా.. శ్రీలంక నాలుగో స్థానంలో ఉంది. ఇంగ్లండ్‌తో జరిగే తదుపరి రెండు మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ గెలిచినా డబ్ల్యూటిసి ఫైనల్‌కు కష్టమే. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్ల పర్సెంటేజీ 47.92గా ఉంది. ఇంగ్లండ్‌తో తదుపరి ఆడబోయే రెండు మ్యాచ్‌ల్లో గెలిచినా న్యూజిలాండ్ పాయింట్ల పర్సెంటేజీ 55.36 శాతం వరకు మాత్రమే చేరుకుంటుంది. ఇక క్రైస్ట్‌చర్చ్ వేదికగా ముగిసిన తొలిటెస్ట్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 8వికెట్ల తేడాతో గెలుపొందింది. డిసెంబర్ 6 నుంచి రెండో టెస్ట్ మొదలుకానుంది.